సాక్షి
నారాయణపేట

ఆదివారం ၊ 22 ၊ అక్టోబర్ ၊ 2023



బతుకమ్మ ఘాట్లు ఏవీ?

బతుకమ్మల నిమజ్జనానికి అచ్చంపేటలో ఘాట్లు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

వివరాలు IVలో ▸



వాలీబాల్ విజేత పాలమూరు

ఎస్‌జీఎఫ్ వాలీబాల్ టోర్నీలో పాలమూరు జిల్లా బాలుర జట్టు విజేతగా నిలిచింది.

వివరాలు IVలో ▸

గరిష్ఠం/కనిష్ఠం
31.4 /20.9

వాతావరణం

రోజంతా ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమవుతుంది. సాయంత్రం చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి



కృష్ణా: బ్యాంకు సేవలను వినియోగించుకొని ప్రజలు ఆర్థికాభివృద్ధి సాధించాలని, వీలైనంత వరకు ఆర్థిక లావాదేవీల్లో అప్రమత్తంగా ఉండాలని ఏపీజీవీబీ రిజనల్ మేనేజర్ రవికిశోర్ రెడ్డి, మాగనూర్ బ్యాంకు మేనేజర్ సుమన్ తెలిపారు. శనివారం మండలంలోని కున్సిలో బ్యాంకు సేవలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటల పాటల ద్వార ప్రజలకు అర్థమయ్యే విదంగా కళాకారులు వివరించారు. అనంతరం బ్యాంకు అందిస్తున్న బీమా సౌకర్యాలు, పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై, అటల్ పెన్షన్‌యోజనతో పాటు ఇతర బీమా సౌకర్యాలను వివరించారు. నగదు రహిత సేవల మూలంగా ప్రజలకు కలిగే ప్రయోజనాలు, సైబర్ నేరాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ శంక్రమ్మ ఆంజనేయులు గౌడ్,ఎంపీటీసీ సభ్యుడు రాంచందర్, అధికారులు విజయ్,సురేష్‌రెడ్డి,ప్రణయ్‌కుమార్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూంకు ఈవీఎంలు



మక్తల్: రానున్న అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా జిల్లా కేంద్రం నుంచి 355 ఈవీఎంలు, 397 వీవీ ప్యాట్లను శనివారం పోలీస్ బందోబస్తు నడుమ మక్తల్‌లోని స్ట్రాంగ్ రూంలోకి చేర్చారు. స్థానిక ప్రభుత్వ కళాశాల మైదానంలో స్టేడియం గదిలో వీటిని భద్రపర్చారు. నియోజకవర్గంలోని 284 పోలింగ్ బూత్‌లకు గాను ఈ ఈవీఎంలు ఇక్కడికి రాగా.. అడిషనల్ కలెక్టర్ మాయాంక్ మిత్తల్, తహసీల్దార్ సువర్ణరాజు పర్యవేక్షించారు.

26న సీఎం కేసీఆర్ రాక

వనపర్తి: జిల్లాకేంద్రంలో 26వ తేదీన నిర్వహించే ఎన్నికల ప్రచార బహిరంగసభకు సీఎం కేసీఆర్ హాజరవుతారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి శనివారం తెలిపారు. జనసమీకరణ కోసం నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ ముఖ్యనాయకులు, ప్రజాప్రతినిధులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. మండలాలు, మున్సిపాల్టీలు, మేజర్ గ్రామపంచాయతీల వారీగా కార్యకర్తలతో చర్చించి సీఎం సభకు పెద్దఎత్తున జనసమీకరణ చేయాలని సూచించారు. సభ విజయవంతానికి నాయకులందరూ క్రియాశీల పాత్ర పోషించాలన్నారు.

అభివృద్ధి చూసే వలసలు..

తొమ్మిదిన్నర ఏళ్లలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ఆకర్షితులై ఇతర రాజకీయ పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లోకి వలసలు కొనసాగుతున్నాయని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి పట్టణంలోని 2వ వార్డుకు చెందిన 60 మంది బీజేపీ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరగా మంత్రి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ట్యాంక్‌బండ్ వేదికగా దసరా ఉత్సవాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: దసరా ఉత్సవ కమిటీ సూచన మేరకు ఈ ఏడాది ట్యాంక్‌బండ్ వేదికగా ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఆర్య సమాజ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దసరా ఉత్సవ కమిటీ కార్యవర్గంతో కలిసి మంత్రి మాట్లాడారు. దసరా ముగింపు ఉత్సవాలు మొదట టీడీ గుట్టలో, తర్వాత జిల్లా పరిషత్ మైదానంలో జరిగాయని, మూడేళ్ల క్రితం జెడ్పీ మైదానంలో అగ్నిప్రమాదం జరిగి ఫైర్ ఇంజిన్ సైతం కాలిపోయిందనానరు. దసరా ముగింపు ఉత్సవాలకు శాశ్వత వేదికను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, అందుకే ఇప్పటి నుంచి ట్యాంక్‌బండ్ వేదికగా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. దసరా వేడుకల్లో బాణసంచా కాల్చే కార్యక్రమం అక్కడే కొనసాగుతుందని, ఆర్య సమాజ్ నుంచి ఊరేగింపు బయలుదేరి క్లాక్‌టవర్, అశోక్‌టాకీస్ చౌరస్తా మీదుగా ట్యాంక్‌బండ్‌కు చేరుకుంటుందన్నారు. మహబూబ్‌నగర్‌లో నిర్వహించే దసరా ఉత్సవాలకు రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందని పేర్కొన్నారు. సమావేశంలో దసరా ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మురళీధర్‌రావు, ముత్యాల ప్రకాశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, ధ్వజధారి కండె కుమార్, ఉపాధ్యక్షుడు మాల్యాద్రిరెడ్డి, కార్యదర్శి గోపాల్‌యాదవ్, వెంకన్న, రాజేశ్వర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మళ్లీ ఆరోగ్య సర్వే

ప్రత్యేక బృందాలతో చేపట్టనున్న వైద్యాధికారులు

- బీపీ, షుగర్, క్యాన్సర్, దీర్ఘకాల వ్యాధిగ్రస్తుల గుర్తింపు
- 30 ఏళ్ల పైబడిన వారి వివరాలు సేకరణ.. ఉచితంగా మందుల పంపిణీ
- మహిళల్లో క్యాన్సర్ గుర్తింపునకు సైతం..
- జిల్లా ఆస్పత్రిలో పాలిటీవ్ కేర్, మానసిక వ్యాధి హెల్త్ క్లీనిక్ ఏర్పాటు



జిల్లా కేంద్రంలో ఎన్‌సీడీ శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారులు

నర్వ: ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం దేశ జనాభా దామాషాలలో దీర్ఘకాలిక వ్యాధులను కలిగిన వారి శాతాన్ని గణిస్తున్నారు. డబ్ల్యూహెచ్‌ఓ అందించిన వివరాల ప్రకారం దేశ జానాభాలో బీపీ వ్యాధి 26 శాతం ఉంటే.. షుగర్ వ్యాధి 12 నుంచి 14 శాతం వరకు ఉందని అంచనా వేశారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ దీనిపై జిల్లాల వారిగా 30 ఏళ్ల పైబడిన వారిని ఆరోగ్య సర్వే చేపట్టాలని గతంలో ఆదేశించారు. దీంతో జిల్లాల్లో ఏఎన్‌ఎంలు, ఆశాలు, ఇతర వైద్య సిబ్బంది ప్రత్యేక సర్వేలో పాల్గొని దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను గుర్తించి వారి కోసం మందులను అందించేందుకు చర్యలు చేపట్టింది. గత రెండు పర్యాయాలు చేపట్టిన సర్వేల ద్వారా బీపీ(రక్తపోటు), షుగర్(మదుమేహం) వంటి వ్యాధుల బారిన పడుతున్న వారిని గుర్తించి వైద్య చికిత్సలు అందిస్తుండగా మూడోసారి అసంక్రమిత వ్యాధుల (ఎన్‌సీడీ- నాన్ కమ్యునికబుల్ డిసీజెస్) సర్వే చేపట్టాలని తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఇందులో ప్రధానంగా బీపీ, షుగర్‌తో పాటు మహిళల్లో క్యాన్సర్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏఎన్‌ఎంలకు విడతల వారీగా శిక్షణ ఇస్తుండగా రెండో విడత ఏఎన్‌ంలకు అవగాహన కల్పిస్తున్నారు. శిక్షణ పొందిన వారి ద్వారా బృందాలను ఏర్పాటు చేసి ఈ నెలలోనే సర్వే ప్రారంభించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

30 ఏళ్లలోపు 2.92లక్షల మంది

గత రెండేళ్లుగా జిల్లాలో చేపట్టిన ఎన్‌సీడీ సర్వే ద్వారా బాధితుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఎప్పటికప్పుడు వివరాల నమోదు చేపడుతున్నారు. జిల్లా వైద్యశాఖ అందించిన వివరాల మేరకు జిల్లాలో మొత్తం 6 లక్షల జనాభాకు గాను 30 ఏళ్ల పైబడిన వారు 2లక్షల 92 వేల 105 మంది ఉన్నారు. స్త్రీ, పురుషులకు ఎన్‌సీడీ సర్వేలో బాగంగా పరీక్షలు నిర్వహిస్తే.. మొత్తం 4,295 మంది(14.7 శాతం) లో బీపీ ఉన్నట్లు గుర్తిస్తే... ఇందులో 23,140, మందిలో షుగర్ ఉన్నట్లు గుర్తించారు. ఇందులో 6935 మందికి చికిత్స అందిస్తున్నారు. 13,586 మంది జిల్లా ఆసుపత్రితో పాటు, ఆయా పీహెచ్‌సీలలో చికిత్స పొందుతున్నారు. వీరికి ప్రతి నెలా మందులు ఉచితంగా అందించి చికిత్స చేస్తున్నారు.

క్యాన్సర్ వ్యాధి గుర్తింపునకు ప్రత్యేకంగా..

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు క్యాన్సర్ వ్యాధి గురించి సరైన అవగాహన లేకపోవడంతో వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారు. వీరిని గుర్తించేందుకు జిల్లాలో ఆలన హోమ్‌కేర్ ప్రత్యేక వాహనం ద్వారా క్యాన్సర్ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి ప్రత్యేక చికిత్సను అందిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆలన హోమ్‌కేర్ ద్వారా 3,329 మంది రోగులున్నట్లు గుర్తించారు. ఇందులో క్యాన్సర్ 291 మంది, నాన్ క్యాన్సర్ కేసులు 3038 మంది ఉన్నట్లు గుర్తించారు. దీంతో పాటు ఇటీవల మానసిక వ్యాధిగ్రస్తుల కోసం జిల్లా ఆసుపత్రిలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి వైద్యుల్ని నియమించారు. ప్రతి శుక్రవారం ఈ కేసుల కోసం పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.



జిల్లాలో గత సర్వే వివరాలు	
జిల్లాలో బీపీ రోగులు	: 4,295
షుగర్ వ్యాధిగ్రస్తులు	: 23,140
30 ఏళ్లు పైబడిన వారి సంఖ్య	: 2,92,105
క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు	: 291
జిల్లాలోని ఆరోగ్య కేంద్రాలు	: 3
ఆరోగ్య ఉప కేంద్రాలు	: 87
జిల్లా ఆసుపత్రి	: 01

ఎన్నికల కోడ్ కారణంగా ఆలస్యం..

ఎన్నికల కోడ్ కారణంగా జిల్లాలో నిర్వహించాల్సిన ఎన్‌సీడీ సర్వే కాస్త ఆలస్యం అవుతోంది. వచ్చే నెల నుంచి పూర్తిస్థాయిలో సర్వే చేపట్టేందుకు సిబ్బందికి శిక్షణ అందిస్తున్నాం. మండలాల్లోని పీహెచ్‌సీలలో ఆశాలకు, జిల్లా స్థాయిలో ఏఎన్‌ఎంలకు శిక్షణ అందిస్తాం. జిల్లా ఆసుపత్రిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మానసిక వ్యాధి చికిత్స ప్రత్యేక కేంద్రాన్ని ప్రతి శుక్రవారం ఏర్పాటు చేశాం. ప్రజలు గుర్తించి సద్వినియోగం చేసుకోవాలి. మహిళల క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం అవగాహన కల్పిస్తున్నాం.

– సౌభాగ్యలక్ష్మి, డీఎంహెచ్‌ఓ



శిక్షణలో హాజరైన ఏఎన్‌ఎంలు

అమరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం



పోలీసు అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

- కలెక్టర్ కోయ శ్రీహర్ష
- పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద ఘన నివాళి

నారాయణపేట: పోలీస్ అమరులను స్మరించుకుంటూ వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శనివారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఎస్పీ కార్యాలయంలోని పరేడ్ మైదానంలో అమరవీరుల స్థూపం వద్ద స్మృతి పరేడ్ నిర్వహించారు. పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద కలెక్టర్, ఎస్పీ యోగేష్ గౌతమ్, అధికారులు, సిబ్బంది పూలమాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పోలీసులు ప్రజల ప్రాణాలు రక్షించేందుకు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహిస్తున్నారని, తీవ్రవాదం, ఉగ్రవాదం, అసాంఘిక శక్తులతో జరిగిన పోరాటాల్లో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి..

జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ 1959లో భారత జవాన్లు విధి నిర్వహణలో అసువులు బాసారని, వారి త్యాగాలు మరువలేనివని ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. పోలీసులు తమ కుటుంబాన్ని వ్యక్తిగత జీవితాలను త్యాగం చేసి దేశంలోని కోట్లాది మంది ప్రజల కోసం ఉద్యగ నిర్వహణలో జీవితాలకు అంకితం చేశారన్నారు. అంతకుముందు ఎస్పీ కార్యాలయం నుంచి సత్యనారాయణ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్‌ఎస్పీ డీఏఆర్ నాగేంద్రుడు, డీఎస్పీలు సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, సీఐలు రవి బాబు, జనార్దన్,రాంలాల్, రాజేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ల నియామకం

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల కోఆర్డినేటర్లను నియమించారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆమోదం మేరకు వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో కొడంగల్‌కు ఎం.జైపాల్‌రెడ్డి, నారాయణపేటకు వినయ్‌కుమార్, మహబూబ్‌నగర్‌కు ప్రశాంత్‌రెడ్డి, జడ్చర్లకు వేణుగోపాల్ యాదవ్, దేవరకద్రకు ఎ.మధుసూదన్‌రెడ్డి, మక్తల్‌కు ధనలక్ష్మి, వనపర్తికి ఎం.జనార్ధన్‌రెడ్డి, గద్వాలకు మొగిళ్ల సత్యారెడ్డి, అలంపూర్‌కు కొండా ప్రశాంత్‌రెడ్డి, నాగర్‌కర్నూల్‌కు ఆశిరెడ్డి, అచ్చంపేటకు ఆకునమోని రాముయాదవ్, కల్వకుర్తికి జె.నరేష్‌కుమార్, కొల్లాపూర్‌కు ప్రదీప్‌గౌడ్, షాద్‌నగర్‌కు వి.నారాయణరెడ్డి కోఆర్డినేటర్లుగా నియమితులయ్యారు. అదేవిధంగా జిల్లాకు చెందిన టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్‌ను చేవెళ్ల నియోజకవర్గానికి కోఆర్డినేటర్‌గా నియమించారు.

అభివృద్ధికి పట్టం కట్టాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మాగనూర్: గత పాలకుల హయంలో కనీస సౌకర్యాలకు నోచుకోని మక్తల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశామని, ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టాలని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కొత్తపల్లిలో బీఆర్‌ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ఇంచార్జీ, తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ ఆథారిటి చైర్మన్ డాక్టర్ ఆంజనేయులుగౌడ్ మాట్లాడుతూ.. 30 రోజులు కార్యకర్తలు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించాలని, ఇక్కడ అభివృద్ధిపై విమర్శలు చేసే కాంగ్రెస్, బిజెపి పార్టీలు తాము అధికారంలో ఉన్న రాష్ట్రంలో ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీలతో సంబంధం లేకుండా మక్తల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశామని అన్నారు. దేశంలో ఏ నాయకుడు చేయాని అభివృద్ధి మన తెలంగాణలో కనిపిస్తుందని, ప్రస్తుతం మెనిఫెస్టో ను ప్రజలలోకి తీసుకువెళ్లాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకురాలు చిట్టెం సుచరిత, జెడ్పీటీసీ వెంకటయ్య, సింగిల్‌విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ తిప్పయ్య, బిఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి, వాకిటి శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఉత్కంఠ..!

- బీజేపీ జాబితా ఖరారులో డైలామా
- కొందరు అభ్యర్థులకు నేరుగా ఫోన్లు
- ఆశావహుల్లో టెన్షన్

పాలమూరు: బీజేపీ అభ్యర్థుల ఖారారులో నాటకీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఆ పార్టీ అధిష్టానం మహబూబ్‌నగర్, కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఇద్దరు అభ్యర్థులను ఖారారు చేయగా వీరితో పాటు గద్వాల, కొల్లాపూర్, మక్తల్ నియోజకవర్గాల్లో సైతం అభ్యర్థులు ఖరారు అయినట్లు జోరుగా ప్రచారం సాగినా ఎవరూ ధ్రువీకరించలేదు. దీనిని నిర్ధారించుకునేందుకు బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణను సంప్రదించగా.. శుక్రవారం రాత్రి రాష్ట్రవ్యాప్తంగా 56 మంది అభ్యర్థులతో కూడిన జాబితాను ఆ పార్టీ అధిష్టానం ఖరారు చేసిందని పేర్కొన్నారు. నేను పోటీలో లేని చెవరు చెప్పారు. ఆదివారం జాబితా వస్తుందని తెలిపారు.

ఢిల్లీ వేదికగా మంతనాలు

బీజేపీ తరపున బరిలో నిలిచే అభ్యర్థుల కోసం కసరత్తు ముమ్మరమవుతోంది. ఢిల్లీ వేదికగా ఇప్పటికే జిల్లా ముఖ్య నేతలతో పార్టీ పెద్దలు మంతనాలు జరిపారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి బీజేపీ అభ్యర్థుల ఖరారుపై ఉత్కంఠ రేపుతోంది. మూడు రోజుల నుంచి మొదటి విడత జాబితాలో ఎవరి పేరు ఉండబోతుందోనని పాలమూరు జిల్లావాసుల్లో ఆందోళన నెలకొంది. ఏ స్థానంలో ఎవరికి టికెట్ ఇవ్వాలనే విషయమై పార్టీ ఉన్నత స్థాయి నేతలు చర్చిస్తున్నారు. ప్రధానంగా సామాజిక సమీకరణలు, ఆశావహులకున్న బలాలపై లోతుగా చర్చిస్తూ తుది జాబితాపై కసరత్తు చేస్తున్నారు. దీనిపై శనివారం రాత్రి ఒక స్పష్టత వచ్చినా.. అధికారికంగా ఆదివారం ఉదయం వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి అభ్యర్థి దాదాపు ఖరారు అయ్యింది. ఏపీ జితేందర్‌రెడ్డిని ఖరారు చేసినట్లు పీఎంఓ కార్యాలయం నుంచి ఫోన్ వచ్చినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి తెలిపారు. అలాగే కల్వకుర్తి అభ్యర్థిగా టి.ఆచారి పేరు కూడా ఖరారైనట్లు తెలుస్తోంది. వీరితోపాటు మరో ఇద్దరు అభ్యర్థుల పేర్లు సైతం ఖరారైనట్లు కూడా సమాచారం. బీజేపీ అభ్యర్థులు తొలి జాబితా శనివారం అర్ధరాత్రి తర్వాత ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

డిజిటల్ బరి.. పోలీస్ గురి

- ప్రచార వారధులుగా నిలుస్తున్న సామాజిక మాధ్యమాలు
- ఇప్పటికే ఎమ్మెల్యే అభ్యర్థుల పేర్లతో వెబ్‌సైట్లు
- వాట్సప్‌లలో ప్రత్యేక గ్రూప్‌ల ఏర్పాటు
- అన్నికోణాల్లోనూ సమాచార సేకరణ
- ఎన్నికల కమిషన్ ఆదేశాలతో పోలీస్‌శాఖ నిఘా



పాలమూరు: 'అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రచార పర్వం వేడెక్కుతోంది. బరిలో నిలిచే నేతలు ఓటర్లను ఆకట్టుకోవడానికి 'వినూత్నంగా' ప్రయత్నిస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో ప్రచారంపై దృష్టిసారిస్తున్నారు. వాట్సాప్, ట్విట్టర్, ఇన్‌స్టాగాం, యూట్యూబ్, ఫేస్‌బుక్‌లతో పాటు మరి కొన్ని సోషల్ మీడియాలను వేదికగా చేసుకొంటున్నారు. ఉమ్మడి జిల్లాలో పలువురు నేతలు ఇప్పటికే పల్లె నుంచి పట్నం వరకు విడివిడిగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి పోస్టులు పెడుతున్నారు. కొందరు నేతలు ఒక అడుగు ముందుకేసి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం నిర్వహించడానికి ప్రత్యేకంగా యువకులను నియమించుకుంటున్నారు.

రాత.. దాటొద్దు గీత

ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. క్షణాల్లో వదంతులు సృష్టించి వ్యాప్తి చేసే సోషల్ మీడియాపై కన్నేశారు. సామాజిక మాధ్యమాల్లో ఇష్టానుసారంగా పోస్టులు పెడుతూ శాంతియుత వాతావరణానికి భంగం కలిగించే వారిపై నిఘా పెంచారు. ఇప్పటికే ఎన్నికల సంఘం ఎన్నికలను పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించడానికి సాంకేతికతను వినియోగించుకుంటోంది. అభ్యర్థులు ఎవరైనా నియమావళి ఉల్లంఘిస్తుంటే పౌరులెవరైనా ఫొటోలు, వీడియోలు తీసి సంబంధిత అధికారికి ఫిర్యాదు చేయవచ్చు. అందిన ఫొటోలు, వీడియోల అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా కచ్చితమైన ప్రాంతాన్ని గుర్తించి అధికారులు చర్యలు తీసుకోవడానికి ఈ యాప్ దోహదపడుతుంది. ఎన్నికల సంఘం సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలను సైతం కట్టడి చేయడానికి ప్రణాళిక రూపొందించి.

వారికే బాధ్యతలు

తాజా, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర పార్టీల నుంచి టికెట్లు ఆశించే ఆశావహులు సైతం ఇప్పటికే ప్రచారం ముమ్మరం చేయడంతో పాటు సా మాజిక మాధ్యమాల్లో చేసిన ప్రచారం ఫొటో లు, వీడియోలు ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేసుకుంటూ ఆదరణ పొందుతున్నారు. వాట్సాప్‌లో బృందాలు ఏర్పాటు చేసి తమ అభిమాన నాయకుల కార్యక్రమాలు, వారి గుణగణాలను తెలియజేస్తూ వీడియోలు విడుదల చేస్తున్నా రు. ఇదంతా ద్వితీయశ్రేణి నాయకుల కనుసన్నల్లో కొనసాగుతోంది. జిల్లాలో ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకమైన ప్రచారం సాగుతోంది. ఇప్పటికే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులను ఖరారు చేయడంతో ఉమ్మడి జిల్లాలోని ఆయా ఎమ్మెల్యేల సంబంధిత నియోజకవర్గాల్లో ప్రచా ర పర్వం ఆరంభమైంది. కొన్ని పార్టీలు గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి గ్రూప్ ఏర్పా టు చేస్తున్నారు. ఇది కాకుండా నేరుగా ఎమ్మె ల్యే అభ్యర్థిని చేరుస్తూ నియోజకవర్గ ముఖ్య నాయకుల గ్రూప్ ఒకటి ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. జిల్లాకేంద్రానికి సమీపంలోని ఒక నియోజకవర్గ తాజా, మాజీ ఎమ్మెల్యే గ్రామస్థాయిలో అసంతృప్తులు, ప్రజలేమనుకుంటున్నారు.. ఏం కోరుకుంటున్నారు.. అనే విషయాలను గ్రామస్థాయి కార్యకర్తల గ్రూప్ ద్వారా అధ్యయనం చేస్తున్నారు. దీన్ని ఆధారం చేసుకొని ఎన్నికల ప్రచారంలో వ్యూహాలు రూపొందిస్తున్నట్లు తెలిసింది. నాయకుల కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా వారి తరపున సామాజిక మాధ్యమాల ఖాతాలను నిర్వహిస్తున్నారు. అందులోనే నాయకుల కటౌట్‌లతో చక్కటి ఫొటోలను తయారు చేసి ప్రచారం చేస్తున్నారు. టికెట్లు ఖారారైన వారి ప్రచారం ఇప్పటికే జోరందుకుంది. ఇతర నాయకుల అనుచరులు ఫేస్‌బుక్‌లో ఎప్పటికప్పుడు ఫొటోలను అప్‌లోడ్ చేస్తున్నారు.

60 శాతం మందికి..

గతంలో ఎన్నికల ప్రచారంలో గోడ రాతలు, ఇంటింటికీ కరపత్రాలు, బ్యానర్ల వినియోగం ఎక్కువగా ఉండేది. కాలానికి అనుగుణంగా నేతలు డిజిటల్ ప్రచారంపై దృష్టిసారించారు. ప్రస్తుతం అందరి చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంది. పలు కంపెనీలు ఇస్తున్న అన్ లిమిటెడ్ నెట్ కనెక్షన్ వల్ల ఇంటర్‌నెట్ వినియోగం బాగా పెరిగింది. వాట్సప్, ఫేస్‌బుక్, యూట్యూబ్, ట్విటర్ వాడటం రోజురోజుకూ పెరుగుతోంది. నేతలు ఓటర్లను ఆకట్టుకోవడానికి వీటినే ప్రచార మార్గాలుగా ఎంచుకొంటున్నారు. సామాజిక మాధ్యమాల్లో అనేక యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రజలు వినియోగించే వాటిలో మాత్రం వాట్సప్, ఫేస్‌బుక్‌దే సింహభాగం. ఈ మాధ్యమాల్లో బృందాలను ఏర్పాటు చేసి తమ సందేశాలను పంచుకొంటున్నారు. దాదాపు జిల్లావ్యాప్తంగా ఓటర్లలో 60 శాతం మందికి వాట్సప్ అకౌంట్ ఉందని ఓ అంచనా. ఇక ఫేస్‌బుక్, ట్విట్టర్ విద్యార్థులు, యువత ఎక్కువగా వినియోగిస్తున్నారు.

పల్లెకు చేరిన వాట్సప్

నూతన టెక్నాలజీ మొదట నగర, పట్టణ ప్రాంతాల్లో అధికంగా ఉపయోగించేవారు. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో పట్టణ ప్రాంతంలో పోటీగా పల్లెలు ముందుకు వెళ్తున్నాయి. గ్రామాల్లో నివాసం ఉండే వారిలో వాట్సప్, ఫేస్‌బుక్ వాడుతున్న వాళ్లు అధికంగా ఉన్నారు. స్మార్ట్‌ఫోన్ వాడుతున్న వాళ్లు పెరగడం వల్ల వాట్సప్ వినియోగించే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. పల్లెల్లో స్నేహితులు, సంఘాలు, గ్రామం పేరుతో ఇలా ప్రత్యేక వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో స్థానికంగా నివసించే వారితో పాటు పట్టణాల్లో జీవనం కోసం వెళ్లిన వారు సైతం సభ్యులుగా ఉంటున్నారు. అలాగే ఫేస్‌బుక్ వినియోగించే వారిలో విద్యార్థులు అధికంగా ఉన్నారు.

ఫేస్‌బుక్‌లలో యువసేన

ఫేస్‌బుక్‌లలో ఎమ్మెల్యేల అభ్యర్థులు, ఆశావహుల అభ్యర్థులైన నాయకుల పేర్ల మీద యువసేన పనిచేస్తోంది. యువతే అధికంగా ఉండటం, సామాజిక మాధ్యమాల్లో ఎక్కువ సమయం గడిపేవారే కావడంతో ఆయా పార్టీలకు ఉపయోగపడనుంది. నియోజకవర్గాల వారీగా ఆయా పార్టీలు వాట్సాప్ ద్వారా తమ సందేశాన్ని తెలిపేందుకు యత్నిస్తున్నాయి. ఇందుకు ఓటర్ల సెల్‌ఫోన్ నంబర్లు అవసరం. వాటి సేకరణ బాధ్యత ఆయా గ్రామాల పార్టీ శ్రేణుల నుంచి తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నారు. ముఖ్యంగా ఆయా గ్రామాల బాధ్యులతో పార్టీ ప్రచార సందేశాన్ని ఆ ప్రాంత ఓటర్లకు చేరవేసే ప్రయత్నం చేస్తున్నారు. సాంకేతికతను వినియోగించే యువసైన్యం కోసం అన్వేషిస్తున్నారు.

ప్రత్యేక బృందాలు ఏర్పాటు



సోషల్ మీడియాలో పెట్టే పోస్టులను పర్యవేక్షించడానికి ప్రత్యేక టీంలను నియమించాం. కంట్రోల్ రూం టీం, సైబర్ క్రైం టీం, స్పెషల్ బ్రాంచ్ ద్వారా నలుగురు కానిస్టేబుళ్లతో ఒక టీం ఏర్పాటు చేయడం జరిగింది. ఎలాంటి సామాజిక మాధ్యమాల్లో అయిన అనవసరమైన పోస్టులు పెడితే బయటకు తీసి కేసులు నమోదు చేస్తాం. గతంలో కూడా జిల్లాలో కేసులు నమోదు చేశాం. ఇప్పటికే చాలామందికి ఈ విషయంలో కౌన్సెలింగ్ సైతం ఇచ్చాం.

– మహేష్, డీఎస్పీ, మహబూబ్‌నగర్

విలక్షణ రాజకీయం

గద్వాలలో పార్టీల కంటే స్థానిక నేతలకే ప్రాధాన్యం

- మూడుసార్లు స్వతంత్ర అభ్యర్థులకు జైకొట్టిన ప్రజలు
- రెండుసార్లు ఉత్తరాది పార్టీలపై అభిమానం
- ఒకసారి పోటీ లేకుండా రాజవంశీయులకూ పట్టం
- 1985 టీడీపీ, 2014లో బీఆర్‌ఎస్‌ ప్రభంజనంలోనూ స్థానిక బలమైన నాయకులకే ఓటు

గద్వాల రూరల్‌: ఉమ్మడి పాలమూరులోని 14 నియోజకవర్గాల్లో గద్వాలది విలక్షణ రాజకీయమని చెప్పవచ్చు. స్వాతంత్య్రానికి పూర్వం సంస్థానంగా వెలుగొందిన ఈ ప్రాంతంపై రాజకీయ పార్టీల కంటే కూడా స్థానిక నేతల ప్రభావమే అధికంగా ఉంటూ వస్తుంది. ప్రధానంగా రాజవంశీయులతో సన్నిహిత సంబంధాలు నెరపిన నాయకులు ఏ పార్టీ నుంచి నిలబడినా వారే అత్యధిక సార్లు ప్రజాబలంతో గెలుపొందుతూ వచ్చారు. దీంతో సహజంగా గద్వాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రాధాన్యత 'పరిమితంగా'నే మారింది. ఇందుకు 1957 నుంచి ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల సరళిని పరిశీలిస్తే అదే విషయం స్పష్టమవుతుంది. అదేవిధంగా ఇప్పటి వరకు 16 సార్లు జరిగిన శాసనసభ ఎన్నికల్లో మూడుసార్లు స్వతంత్ర అభ్యర్థులను గెలవగా.. రాజవంశీయులకు చెందిన నేత ఓసారి ఎమ్మెల్యేగా ఏకగ్రీవంగా గెలుపొందారు. దీంతోపాటు ఉత్తరాది పార్టీలైన జనతా, సమాజ్‌వాదీ పార్టీల తరపున బరిలో నిలిచిన అభ్యర్థులకు జైకొట్టడం.. ఇన్ని ప్రత్యేకతలున్న గద్వాల నియోజకవర్గం 1985లో టీడీపీ ప్రభంజనం, 2004లో కాంగ్రెస్‌ పార్టీ, 2014లో తెలంగాణ వాదం ఉవ్వెత్తున ఎగసిపడి రెండు పార్టీలు అధికారం చేపట్టగా ఇక్కడ మాత్రం టీడీపీ, టీఆర్‌ఎస్‌ అభ్యర్థులు ఓటమిపాలవడం గద్వాల విలక్షణ రాజకీయానికి నిదర్శనం.

ప్రభంజనంలోనూ స్థానికులకే..

గద్వాల శాసనసభకు 16 సార్లు ఎన్నికలు జరగగా మూడు సార్లు స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందారు. అలాగే ఉత్తరాది పార్టీలైన జనాత, సమాజ్‌వాదీ పార్టీల నుంచి బరిలో నిలిచిన అభ్యర్థులకు సైతం జైకొట్టగా.. మరోవైపు 1985లో టీడీపీ, 2004లో కాంగ్రెస్‌, 2014లో బీఆర్‌ఎస్‌లు రాష్ట్రవ్యాప్తంగా ప్రభంజనాన్ని సృష్టించి అధికారం చేపట్టగా ఇక్కడ మాత్రం ఆ పార్టీలకు చెందిన అభ్యర్థులు ఓటమి పాలుకావడం గమనార్హం. ఇలా ఉమ్మడి పాలమూరు జిల్లాలో గద్వాల రాజకీయపరంగా తన ప్రత్యేకతను చాటుకుంటోంది.


గద్వాల ముఖచిత్రం

ఆది నుంచి వ్యక్తులకే ప్రాధాన్యత..

దేశానికి స్వాతంత్య్రం 1947లో వచ్చినప్పటికీ గద్వాల సంస్థానంగా వెలుగొందుతూ స్వతంత్ర ప్రాంతంగానే ఉండేది. అయితే అప్పటి నిజాం ఈ ప్రాంతాన్ని పాకిస్తాన్‌లో కలిపే ప్రయత్నాలకు వ్యతిరేకంగా గద్వాలను పాలించే మహారాణి ఆదిలక్ష్మీదేవమ్మ భారతదేశంలో కలిపేందుకు సిద్ధంగా ఉన్నానని అప్పటి భారత సర్కార్‌కు లేఖ పంపారు. అలా భారతదేశంలో విలీనమైన గద్వాల 1957లో తొలిసారిగా నియోజకవర్గంగా ఆవిర్భవించి ప్రజాస్వామ్యయుత ఎన్నికలు జరిగాయి.

1957లో జరిగిన తొలి శాసనసభ ఎన్నికల్లో డీకే సత్యారెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్‌ పార్టీ నుంచి పోటీచేసిన పాగపుల్లారెడ్డిపై 5,238 ఓట్ల తేడాతో గెలుపొందారు.


డీకే సత్యారెడ్డి

1962లో జరిగిన ఎన్నికల్లో రాజవంశ కుటుంబానికి చెందిన కె.రాంభూపాల్‌ బరిలో నిలిచారు. అయితే మిగతా పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు ఎవరూ పోటీ చేయకపోవడంతో కె.రాంభూపాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.


రాజా కృష్ణరాంభూపాల్‌

1967లో గోపాల్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా నిలబడి కాంగ్రెస్‌ పార్టీ నుంచి బరిలో నిలిచిన డీకే సత్యారెడ్డిని 7,427 ఓట్ల తేడాతో ఓడించారు.


ఉప్పల గోపాల్‌రెడ్డి

1972లో జరిగిన ఎన్నికల్లో పాగ పుల్లారెడ్డి కాంగ్రెస్‌ పార్టీ నుంచి బరిలో నిలిచి తన సమీప ప్రత్యర్థి డీకే సత్యారెడ్డి సోషలిస్టు తెలంగాణ పీపుల్స్‌ సమితీ పార్టీ నుంచి బరిలో నిలిచి పాగ పుల్లారెడ్డి చేతిలో 4,406 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఈ ఎన్నికల సమయంలో తొలిదశ తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిపడుతున్న కారణంగా స్థానికంగా ఉండే యువత పెద్దఎత్తున తెలంగాణ నినాదంతో ఎన్నికల్లో పోటీచేసిన మాజీ సీఎం మర్రి చెన్నారెడ్డి పార్టీకి జైకొట్టారు. అలా జైకొట్టిన వారిలో డీకే సత్యారెడ్డి కుమారుడు మాజీ ఎమ్మెల్యే డీకే భరతసింహారెడ్డి కూడా ఉన్నారు. మర్రి చెన్నారెడ్డి పార్టీకి జైకొట్టి తన తండ్రి డీకే సత్యారెడ్డికి వ్యతిరేకంగా పనిచేయడం విశేషం.


పాగపుల్లారెడ్డి

1978లో జరిగిన ఎన్నికల్లో డీకే సత్యారెడ్డి జనతా పార్టీ నుంచి, పాగ పుల్లారెడ్డి కాంగ్రెస్‌ పార్టీ నుంచి పోటీ పడగా డీకే సత్యారెడ్డి 18,394 ఓట్ల తేడాతో పాగపుల్లారెడ్డిని ఓడించారు.

1980లో డీకే సత్యారెడ్డి మృతితో జరిగిన ఉప ఎన్నికల్లో ఆయన కుమారుడు డీకే సమరసింహారెడ్డి కాంగ్రెస్‌(ఐ) పార్టీ నుంచి, పాగ పుల్లారెడ్డి కాంగ్రెస్‌(యూ) పార్టీ నుంచి పోటీపడగా డీకే సమరసింహారెడ్డి 26,894 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.


డీకే సమరసింహారెడ్డి

1983లో జరిగిన ఎన్నికల్లో డీకే సమరసింహారెడ్డి కాంగ్రెస్‌ పార్టీ నుంచి పోటీ చేసి తన సమీప ప్రత్యర్థి అయిన పాగ పుల్లారెడ్డి (టీడీపీ)పై 4,593 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

1985 ఎన్నికల్లో డీకే సమరసింహారెడ్డి కాంగ్రెస్‌(ఐ) పార్టీ నుంచి, ఎస్‌.గోపాల్‌రెడ్డి టీడీపీ నుంచి పోటీపడగా ఎస్‌.గోపాల్‌ రెడ్డి 94 ఓట్ల తేడాతో గెలుపొందారు. అయితే ఈ ఎన్నికల్లో కౌంటింగ్‌ సరిగా నిర్వహించలేదని డీకే సమరసింహారెడ్డి హైకోర్టును ఆశ్రయించగా జడ్జి సమక్షంలో చేపట్టిన కౌంటింగ్‌లో డీకే సమరసింహారెడ్డి 74 ఓట్ల మెజారిటీతో గెలుపొందినట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. 1985లో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్టీఆర్‌ నేతృత్వంలో టీడీపీ ప్రభంజనం సృష్టించి రాష్ట్రంలో అధికారం చేపట్టగా గద్వాలలో మాత్రం టీడీపీ అభ్యర్థి ఓటమి పాలయ్యారు.

1989లో జరిగిన ఎన్నికల్లో డీకే సమరసింహారెడ్డి కాంగ్రెస్‌(ఐ) పార్టీ నుంచి, ఎల్కూరు వెంకట్రామిరెడ్డి టీడీపీ నుంచి పోటీ పడగా డీకే సమరసింహారెడ్డి 10,454 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

1994లో జరిగిన ఎన్నికల్లో సొంత అన్నదమ్ములైన డీకే సమరసింహారెడ్డి కాంగ్రెస్‌(ఐ) పార్టీ నుంచి, డీకే భరతసింహారెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా తలపడ్డారు. ఈ ఎన్నికల్లో డీకే భరతసింహారెడ్డి డీకే సమరసింహారెడ్డిపై 32,561 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందడం అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది.


డీకే భరత్‌సింహారెడ్డి

1999లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి గట్టు భీముడు, కాంగ్రెస్‌ (ఐ) పార్టీ నుంచి డీకే అరుణ పోటీ పడగా.. గట్టు భీముడు 4,546 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ ఎన్నికల్లో డీకే సమరసింహారెడ్డికి కాంగ్రెస్‌ పార్టీ టికెట్‌ రాకపోవడంతో రెండు బలమైన రాజకీయ పార్టీలతో తలపడి ఇండిపెండెంట్‌గా బరిలో నిలిచి 20 వేల పైచిలుకు ఓట్లు సాధించడం విశేషం.


గట్టు భీముడు

2004లో జరిగిన ఎన్నికల్లో పొత్తులో భాగంగా కాంగ్రెస్‌ పార్టీ గద్వాల స్థానాన్ని బీఆర్‌ఎస్‌ పార్టీకి కేటాయించింది. దీంతో డీకే అరుణకు కాంగ్రెస్‌ పార్టీ టికెట్‌ రాకపోవడంతో ఆమె సమాజ్‌వాది పార్టీ తరపున ఎన్నికల బరిలో నిలవగా.. మరోవైపు గట్టు భీముడు టీడీపీ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. ఆ సమయంలో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్‌ పార్టీ ప్రభంజనం సృష్టిస్తూ అధికారంలోకి రాగా ఇక్కడ మాత్రం డీకే అరుణ 38,686 భారీ మెజారిటీతో గెలుపొందడంతో గద్వాల ప్రాంతం మరోసారి తన విలక్షణ రాజకీయాన్ని చాటినట్లయింది.


డీకే అరుణ

2009లో డీకే అరుణ కాంగ్రెస్‌ పార్టీ నుంచి, టీడీపీ నుంచి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తలపడగా డీకే అరుణ 10,427 మెజారిటీతో గెలుపొందారు.

2014లో జరిగిన ఎన్నికల్లో డీకే అరుణ కాంగ్రెస్‌ పార్టీ నుంచి బరిలో నిలవగా, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బీఆర్‌ఎస్‌ నుంచి పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా బీఆర్‌ఎస్‌ ప్రభంజనం సృష్టించి అధికారం చేపట్టగా గద్వాలలో మాత్రం ఆ పార్టీ అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి డీకే అరుణ చేతిలో 8,260 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు.

2018లో ఎన్నికల్లో మరోసారి డీకే అరుణ కాంగ్రెస్‌ పార్టీ నుంచి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బీఆర్‌ఎస్‌ నుంచి తలపడగా ఈసారి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి డీకే అరుణపై 28,260 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. డీకే అరుణకు 71,612ఓట్లు రాగా, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి 1,00,057 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన జి.వెంకటాద్రిరెడ్డికి 1,900 రాగా, సమాజ్‌వాది ఫార్వర్డ్‌ బ్లాక్‌ పార్టీ నుంచి అభ్యర్థిగా పోటీచేసిన అబ్దుల్‌ మోహిద్‌ఖాన్‌కు అనూహ్యంగా 7,189 ఓట్లు రావడం కొసమెరుపు. అబ్దుల్‌మోహిద్‌ఖాన్‌ ఎన్నికల గుర్తు ట్రక్కు రావడం.. అది కారును పోలి ఉండడంతో కొంతమంది ఓటర్లు ట్రక్కుకు ఓటేశారనే ప్రచారం జరిగింది.


బి.కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల నియోజకవర్గంలో ఓటర్ల వివరాలిలా..

మండలం	పురుషులు	మహిళలు	థర్డ్‌ జెండర్‌	మొత్తం
ధరూర్‌	18,762	19,476	1	38,239
కేటీదొడ్డి	13,841	14,008	-	27,849
గట్టు	22,732	23,488	1	46,221
మల్దకల్‌	20,734	21,380	-	42,114
గద్వాల	17,275	17,729	-	35,004
గద్వాల టౌన్‌	31,419	33,015	8	64,442
మొత్తం	1,24,763	1,29,096	10	2,53,869



గద్వాల నియోజకవర్గం చిత్రం

1957 నుంచి 2018 వరకు గెలుపొందినవారు..

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి
1957	డీకే సత్యారెడ్డి
1962	కె.రాంభూపాల్‌
1967	గోపాల్‌రెడ్డి
1972	పాగపుల్లారెడ్డి
1978	డీకే సత్యారెడ్డి
1980(ఉ.ఎ)	డీకే సమరసింహారెడ్డి
1983	డీకే సమరసింహారెడ్డి
1985	ఉప్పల గోపాల్‌రెడ్డి
1985	డీకే సమరసింహారెడ్డి (కోర్టు తీర్పుతో గెలుపు)
1989	డీకే సమరసింహారెడ్డి
1994	డీకే భరతసింహారెడ్డి
1999	గట్టు భీముడు
2004	డీకే అరుణ
2009	డీకే అరుణ
2014	డీకే అరుణ
2018	బి.కృష్ణమోహన్‌రెడ్డి

కాంగ్రెస్‌ సభలో బీఆర్‌ఎస్‌ కార్యకర్తల హల్‌చల్‌


కాంగ్రెస్‌ నాయకులతో వాదనకు దిగిన బీఆర్‌ఎస్‌ కార్యకర్తలు

హన్వాడ: మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికల సన్నాహక సభలో బీఆర్‌ఎస్‌ కార్యకర్తలు హల్‌చల్‌ చేశారు. కాంగ్రెస్‌ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను పీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్‌ వివరిస్తున్న క్రమంలో జిల్లా కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్‌ కార్యకర్త హైమద్‌ఖాన్‌తో పాటు మరో ఇద్దరు అడ్డు తగిలారు. కర్ణాటకలో అధికారంలో ఉన్న మీ పార్టీ అమలు పర్చని పథకాలను ఇక్కడెలా అమలు చేస్తారని ప్రశ్నించారు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వారిపై కాంగ్రెస్‌ కార్యకర్తలు మూకుమ్మడిగా దాడి చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు అక్కడికి చేరుకుని ఇరు పార్టీల కార్యకర్తలను చెదరగొట్టారు. అనంతరం కాంగ్రెస్‌ సభ సజావుగా సాగింది. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వినోద్‌కుమార్‌లకు స్థానిక నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.

కేసు నమోదు..

కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణయ్యయాదవ్‌ ఫిర్యాదు మేరకు హైమద్‌ఖాన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవినాయక్‌ తెలిపారు. కాగా తాను బీఆర్‌ఎస్‌ కార్యకర్తను కానని హైమద్‌ఖాన్‌ సోషల్‌ మీడియాలో పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది. అతడికి మతిస్థిమితం సరిగ్గా లేదని ఆ పార్టీ నాయకులే విమర్శలు చేస్తున్నారు.

ఓడే సీట్లు బీసీలకు.. గెలిచే సీట్లు ఓసీలకా?

- మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌


మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌

జెడ్పీసెంటర్‌ (మహబూబ్‌నగర్‌): బీజేపీ వచ్చే ఎన్నికల్లో ఓడే సీట్లు బీసీలకు కేటాయించి.. గెలిచే సీట్లు ఓసీలకు కేటాయించిందని, ఇదేనా మీరు బీసీలకు ఇచ్చే గౌరవం అని రాష్ట్ర ఎక్సైజ్‌, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ ప్రశ్నించారు. శనివారం స్థానిక ఫాంహౌస్‌లో మంత్రి విలేకరులతో మాట్లాడారు. బీసీ ప్రధాని అని చెప్పుకొనే బీజేపీ కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ కేటాయించడం లేదని విమర్శించారు. 80 శాతం ఉన్న బీసీలకు కేవలం రూ.2 వేల కోట్ల బడ్జెట్‌ కేటాయించడమేనా బీసీలపై ఉన్న చిత్తశుద్ధి అని నిలదీశారు. బీసీల అభ్యున్నతి కోసం కేంద్ర బడ్జెట్‌లో రూ.లక్ష కోట్లు కేటాయించాలని డిమాండ్‌ చేశారు. బీసీలపై ప్రేమ ఉంటే అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్‌పై చేసిన తీర్మానం మేరకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా బీసీలకు వెయ్యి గురుకులాలు ఏర్పాటు చేసిన ఘనత తమ ప్రభుత్వానిది అన్నారు. ఇద్దరు ఎమ్మెల్యేలుగా అవకాశం ఇస్తూ.. ప్రతిపాదిస్తే కుట్ర పూరితంగా వెనక నుంచి తిరస్కరించేలా కుట్ర చేసింది బీజేపీ కాదా అని విమర్శించారు. బీసీ ప్రధాని ఉన్నంత మాత్రాన బీసీల బతుకులు బాగుపడవని.. ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేలా కృషిచేయాలన్నారు. బీసీలకు విద్యను ప్రోత్సహించేందుకు రూ.20 లక్షల నిధులు ఇస్తూ ఓవర్సీస్‌ విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్‌ స్వర్ణసుధాకర్‌రెడ్డి, డీసీసీబీ వైస్‌ చైర్మన్‌ వెంకటయ్య, కౌన్సిలర్‌ మునీరొద్దీన్‌, రవీందర్‌రెడ్డి, రాములు, లక్ష్మణ్‌ తదితరులు పాల్గొన్నారు.

రాయినిపల్లిలో పట్టుబడిన చీరలు

పాన్‌గల్‌: పాన్‌గల్‌ మండలం రాయినిపల్లిలో బీజేపీ నాయకులు ఈర్ల మైబూషి ఇంట్లో ఓటర్లకు పంచేందుకు చీరలు ఉన్నాయనే సమాచారం మేరకు శనివారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఇందులో వంద చీరలు పట్టుబడినట్లు ఎస్‌ఐ వేణు తెలిపారు. చీరలు స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు. ఓటర్లను అకర్షించేందుకు ఇలాంటి బహుమతులు ఇవ్వడం ఎన్నికల నిబంధనలకు విరుద్ధమన్నారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలన్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న చీరలు

అధికారులకు మెజిస్టీరియల్‌ పవర్‌

- కలెక్టర్‌ ఉదయ్‌కుమార్‌

మన్ననూర్‌: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో భాగంగా చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహిస్తున్న అధికారులకు మెజిస్టీరియల్‌ పవర్‌ ఇచ్చినట్లు నాగర్‌కర్నూల్‌ కలెక్టర్‌, జిల్లా ఎన్నికల అధికారి ఉదయ్‌కుమార్‌ అన్నారు. మున్ననూర్‌ వద్ద ఏర్పాటు చేసిన అంతర్‌రాష్ట్ర బార్డర్‌ చెక్‌పోస్టును శనివారం ఎస్పీ గైక్వాండ్‌ వైభవ్‌ రాఘునాథ్‌తో కలిసి కలెక్టర్‌ పరిశీలించారు. ఈ సందర్భంగా చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వర్తిస్తున్న ఎక్సైజ్‌, పోలీస్‌, ఫారెస్టు, వ్యవసాయ శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ రహదారి గుండా రాకపోకలు సాగించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే పంపించాలని ఆదేశించారు. జిల్లా పరిధిలోని చెక్‌పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు జిల్లా ఎన్నికల అధికారికి అనుసంధానం ఉండటంతో పాటు ఎన్నికల కమిషన్‌ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుందని తెలిపారు. చెక్‌పోస్టు వద్ద శనివారం ఎన్నికల నిర్వహణ అధికారిణి ముంతాజ్‌బేగం నేతృత్వంలో రూ.69,500 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు రూ.1.31 కోట్లకుపైగా నగదును స్వాధీనం చేసుకున్నట్లు కలెక్టర్‌ తెలిపారు. ఇదిలా ఉండగా ఇప్పటి వరకు అధికారులు సీజ్‌ చేసిన నగదుకు సంబంధించి ఆధారాలు ఉంటే జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి నర్సింగ్‌రావు (8790990501) నంబర్‌ను సంప్రదించి గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం డబ్బులను తిరిగి అందజేయనున్నట్లు తెలిపారు. వారి వెంట డీఎస్పీ కృష్ణకిషోర్‌, సీఐ అనుదీప్‌ తదితరులు ఉన్నారు.


మున్ననూర్‌ చెక్‌పోస్టును పరిశీలిస్తున్న కలెక్టర్‌ ఉదయ్‌కుమార్‌

బీఆర్‌ఎస్‌ పార్టీకి 'వర్కటం' రాజీనామా


వర్కటం జగన్నాథరెడ్డి

మక్తల్‌: బీఆర్‌ఎస్‌ నియోజకవర్గ నాయకుడు, వీజేఆర్‌ ఫౌండేషన్‌ చైర్మన్‌ వర్కటం జగన్నాథరెడ్డి పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మక్తల్‌ అసెంబ్లీ టికెట్‌ తనకు ఇవ్వాలని అడిగినా పట్టించుకోవడం లేదన్నారు. తాను నియోజకవర్గంలో సొంత డబ్బు వెచ్చించి సేవా కార్యక్రమాలు చేపట్టానన్నారు. వెనకబడిన మక్తల్‌ ప్రాంతాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. ఇందుకోసం త్వరలోనే ఓ జాతీయ పార్టీలో చేరి మక్తల్‌ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తానని పేర్కొన్నారు.

మద్యం పట్టివేత

మహబూబ్‌నగర్‌ క్రైం/గద్వాల క్రైం/అలంపూర్‌ రూరల్‌/ఎర్రవల్లిచౌరస్తా/మానవపాడు: కోయిలకొండ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో శనివారం రూ.34,394 విలువగల 75.97 లీటర్ల లిక్కర్‌ సీజ్‌ చేసినట్లు పోలీసులు తెలిపారు. నవాబ్‌పేట్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో 37మంది, రూరల్‌లో 10మంది, కోయిలకొండ 27మంది, హన్వాడ 21మంది, మహ్మదాబాద్‌ ఆరుగురిని బైండోవర్‌ చేసినట్లు పేర్కొన్నారు.

- గద్వాల జిల్లా కేంద్రంలో వెంకటేష్‌, సాహుల నుంచి రూ.50వేల విలువజేసే మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్‌ సీఐ గోపాల్‌ తెలిపారు. సంగాలకు చెందిన హన్మంతు ఇంట్లో రూ.5వేల విలువగల మద్యం పట్టుకున్నట్లు ఎస్‌ఐ ఆనంద్‌ పేర్కొన్నారు.
- అలంపూర్‌ మండలం కోనేరుకు చెందిన గోపాల్‌ మోటార్‌సైకిల్‌పై రూ.31,790 విలువగల మద్యం తరలిస్తుండగా, పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమేష్‌ తెలిపారు.
- ఎర్రవల్లి మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన తలారి పెంటన్న కిరాణ షాపులో రూ.3,380 విలువగల మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కృష్ణదేవ తెలిపారు.
- కర్నూల్‌కు చెందిన అభిలాష్‌రెడ్డి కారులో 30 కాటన్ల మద్యం తరలిస్తుండగా, మానవపాడు మండలం శ్రీనగర్‌ స్టేజీ వద్ద పట్టుకున్నట్లు ఎస్‌ఐ రాము తెలిపారు.

రూ.25.16 లక్షల నగదు సీజ్‌


మాగనూర్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ మల్లేష్‌

మహబూబ్‌నగర్‌ క్రైం/వనపర్తి/గద్వాల క్రైం/మాగనూర్‌: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో శనివారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. రూ.50వేలకు మించి తరలిస్తున్న నగదును స్వాధీనం చేసుకుని సీజ్‌ చేశారు. మహబూబ్‌నగర్‌ జిల్లా కేంద్రంతో పాటు భూత్పూర్‌లో నిర్వహించిన తనిఖీల్లో రూ.12లక్షల 50వేలు సీజ్‌ చేశారు. రూరల్‌ పోలీసులు రూ.10లక్షలు, భూత్పూర్‌లో రూ.2.50లక్షలు సీజ్‌ చేసినట్లు పోలీసులు తెలిపారు.

- వనపర్తి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన వాహనాల తనిఖీల్లో పట్టుబడిన రూ.6.16 లక్షల నగదును సీజ్‌ చేసినట్లు ఎస్పీ రక్షితా కె.మూర్తి వెల్లడించారు. వనపర్తి మండలం పెద్దగూడెం క్రాస్‌రోడ్‌ వద్ద రూ.3.38 లక్షలు, పెబ్బేరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో రూ.2.78 లక్షల నగదును ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకువెళ్తుండగా సీజ్‌ చేసినట్లు తెలిపారు. దీంతోపాటు జిల్లా వ్యాప్తంగా 32 లీటర్ల మద్యం సీజ్‌ చేశారు.
- గద్వాల జిల్లా కేంద్రంలోని సంగాల పార్కు వద్ద రాయచూర్‌ జిల్లాకు చెందిన సాగర్‌ అనే వ్యక్తి రూ.5లక్షల నగదు తరలిస్తుండగా, పట్టుకుని సీజ్‌ చేసినట్లు ఎస్‌ఐ ఆనంద్‌ తెలిపారు.
- నారాయణపేట జిల్లా మరికల్‌ మండలం పల్లెగడ్డకు చెందిన రవికుమార్‌ రూ.లక్షా 50వేల నగదు తరలిస్తుండగా, మాగనూర్‌లో పట్టుకున్నట్లు ఎస్‌ఐ మల్లేష్‌ వెల్లడించారు. నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్‌ చేసినట్లు తెలిపారు.

47 మంది బైండోవర్‌

జడ్చర్ల: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో 47మంది పాత నేరస్తులను శనివారం జడ్చర్ల తహసీల్దార్‌ శ్రీనివాసులు ఎదుట బైండోవర్‌ చేసినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. బైండోవర్‌ అయిన వ్యక్తులు అల్లర్లు తదితర నేరపూరిత ఘటనలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్లుప్తంగా

జిలెటిన్ స్టిక్స్ పేలి వ్యక్తి దుర్మరణం

కొల్లాపూర్: కొల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చుక్కాయిపల్లిలో శనివారం సాయంత్రం జిలెటిన్ స్టిక్స్ పేలి మహంకాళి సూరి(54) మృతిచెందాడు. తన ఇంటి పరిసరాల్లోని చెత్తను శుభ్రం చేస్తుండగా.. రాతి గోడలోని జిలెటిన్ స్టిక్స్ పేలాయి. దీంతో సూరి అక్కడికక్కడే మృతిచెందాడు. ఆ ప్రాంతంలో పేలుడు పదార్థాలు ఎవరు పెట్టారన్నది తెలియరాలేదు. సంఘటనా స్థలానికి ఎస్ఐ బాలవెంకటరమణ చేరుకొని దర్యాప్తు చేపట్టారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. అయితే వారు చాలా ఏళ్ల కిందటి నుంచే వేర్వేరుగా ఉంటున్నారు. ప్రస్తుతం గ్రామంలోని తన తండ్రి కృష్ణయ్యతోనే సూరి ఉంటున్నాడు.

బైక్‌పై నుంచి పడి..

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన నాగర్‌కర్నూల్ మండలం మంతటి శివారులో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ మహేందర్ వివరాల మేరకు.. తెలకపల్లి మండలం అనంతసాగర్‌కు చెందిన మద్దెల కురుమూర్తి (55) బైక్‌పై జిల్లా కేంద్రం నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా, మంతటి శివారులో అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు స్థానిక జనరల్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మరో వ్యక్తి..

దేవరకద్ర రూరల్: రైలు ప్రమాదంలో గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి (35) శుక్రవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ సయ్యద్ అక్బర్ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. ఈనెల 16న దేవరకద్ర సమీపంలో రైలు పట్టాల పక్కన కాలిన గాయాలతో వ్యక్తి పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు.. చికిత్స నిమిత్తం 108లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఆస్పత్రికి వెళ్లి బాధితుడిని విచారించారు. తన పేరు ఫయాజుద్దీన్‌బాబా అని, గద్వాల ప్రాంతానికి చెందిన వ్యక్తినని, గూడ్స్ రైలుపైకెక్కి తమ గ్రామానికి వెళ్తుండగా, విద్యుత్ షాక్‌కు గురైనట్లు పేర్కొన్నాడు. అతడి వివరాల మేరకు విచారణ నిర్వహిస్తున్న క్రమంలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. తమ విచారణలో మృతుడికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదని, ఆచూకీ తెలిసిన వారు 9441273164 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

శ్రీశైలం నీటిమట్టం 846.8 అడుగులు

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో శనివారం 846.8 అడుగుల వద్ద 73.3790 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 1,021, ముచ్చుమర్రి నుంచి కేసీ కెనాల్‌కు 735, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,550, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భకేంద్రంలో 0.740 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 1,496 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు. జలాశయంలో 191 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

ఆయుర్వేద ఆస్పత్రి తనిఖీ



మన్ననూర్: మండల కేంద్రంలోని ఆయుర్వేద ఆస్పత్రిని శనివారం ఆయుష్ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ పరమేశ్వర్‌నాయక్, రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ హేమలత తనిఖీ చేశారు. స్థానిక పీహెచ్‌సీలోని చిన్న గదిలో ఆయుర్వేద ఆస్పత్రి నిర్వహించడంపై విస్మయం వ్యక్తం చేశారు. పీహెచ్‌సీ డాక్టర్ వార్డులో కూర్చొని ఆయుర్వేద ఆస్పత్రికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం డాక్టర్ జాన్సన్‌తో సమావేశమై పలు అంశాలపై ఆరా తీశారు. ఆయుర్వేద ఆస్పత్రికి పక్కా భవనం లేదని, ఉన్నతాధికారుల సూచన మేరకు పీహెచ్‌సీలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది గోవింద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత పాలమూరు

- హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్
- ఖమ్మంపై జిల్లా బాలుర జట్టు విజయం
- బాలికల విభాగంలో చాంపియన్‌గా నిలిచిన నిజామాబాద్



రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీలో మొదటి బహుమతి అందుకుంటున్న పాలమూరు బాలుర జట్టు

రాజాపూర్: మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్–17 వాలీబాల్ టోర్నీలో పాలమూరు బాలుర జట్టు విజేతగా నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో పాలమూరు జట్టు ఖమ్మంపై విజయం సాధించింది. మూడో స్థానంలో ఆదిలాబాద్ జట్టు నిలిచింది. మహబూబ్‌నగర్, ఖమ్మం జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠ భరితంగా సాగింది. మొదటి సెట్‌లో పాలమూరు జట్టు 25–18 పాయింట్ల తేడాతో విజయం సాధించగా, రెండవ సెట్‌లో ఖమ్మం 27–25 పాయింట్ల తేడాతో గెలుపొందింది. చివరి సెట్‌లో హోరాహోరీగా సాగిన పోరులో పాలమూరు జట్టు ఖమ్మంపై 15–11 పాయింట్లు సాధించి చాంపియన్‌గా నిలిచింది.

బాలికల విభాగంలో...

బాలికల విభాగం ఫైనల్ మ్యాచ్‌లో నిజామాబాద్ జట్టు నల్లగొండపై విజయం సాధించింది. మూడో స్థానంలో రంగారెడ్డి జిల్లా జట్టు నిలిచింది. విజేతలకు ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాంరెడ్డి ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపోటములను సమానంగా స్వీకరించాలని క్రీడాకారులకు సూచించారు. రాష్ట్రస్థాయి టోర్నీలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జాతీయస్థాయికి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు, హెచ్‌ఎం ఆనంద్‌కుమార్, ఎంపీడీఓ లక్ష్మీదేవి, పీడీలు వడన్న, వేణుగోపాల్, రాజవర్ధన్‌రెడ్డి, గజానంద్ పాల్గొన్నారు.



ఫైనల్ మ్యాచ్‌లో తలపడుతున్న ఖమ్మం, పాలమూరు జట్లు



బాలికల విభాగంలో మొదటి బహుమతి అందుకుంటున్న నిజామాబాద్ జట్టు

ఇథనాల్ కంపెనీ వ్యర్థాల తరలింపు

- గమనించి అడ్డుకున్న గ్రామస్తులు



పొల్యూషన్ ట్యాంకర్‌ను అడ్డుకున్న ఎక్లాస్‌పూర్ వాసులు

మరికల్: చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ నుంచి వచ్చిన వ్యర్థాలను ట్యాంకర్ల ద్వారా గుట్టుచప్పుడు కాకుండా బయటకు తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అడ్డుకుని ఆందోళన చేపట్టారు. శనివారం రాత్రి ఇథనాల్ కంపెనీ నుంచి వ్యర్థ ద్రవ పదార్థాలను ఎక్లాస్‌పూర్ గ్రామ శివారులో వదిలిపెట్టేందుకు ప్రయత్నించగా.. గ్రహించిన గ్రామస్తులు ట్యాంకర్‌ను అడ్డుకుని నిలదీశారు. అలాగే చిన్నచింతకుంట మండలం ఉద్యాల వద్ద కూడా ఓ పొల్యూషన్ ట్యాంకర్‌ను గ్రామస్తులు అడ్డుకున్నారు. వారం రోజుల కిందట పొల్యూషన్ ట్యాంకర్ నుంచి వదిలిన ద్రవ పదార్థాలను గ్రామాల శివారులోని రోడ్ల పక్కన వదలడంతో గ్రామాల్లోకి దుర్వాసన వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో అనారోగ్యం బారిన పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కంపెనీ రద్దు చేసి ఇక్కడి వాతావారణం కాపాడాలని గ్రామస్తులు ధర్నాను కొనసాగిస్తున్నారు. గ్రామస్తులు ఆందోళన విరమించకపోవడంతో నారాయణపేట నుంచి స్పెషల్ పార్టీ పోలీసులు రావడంతో పరిస్థితి మరింత ఉద్రక్తతకు దారి తీసింది. దీంతో పరిస్థితి చెయ్యి దాటిపోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. రాత్రి పది దాటిన కూడా కంపెనీ ఎదుట ధర్నా కొనసాగిస్తున్నారు.

జేష్ఠ్యాదేవి సమేత శనేశ్వరుడికి పూజలు

బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్ గ్రామ జేష్ఠ్యాదేవి సమేత శనేశ్వరుడికి ఆలయ ప్రధాన అర్చకులు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకారాలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



శనేశ్వరుడికి తైలాభిషేకం చేస్తున్న భక్తులు

కర్నెతండాలోనే మొదటి తుల్జాభవాని ఆలయం



కర్నెతండాలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి



నృత్యం చేస్తున్న గిరిజన చిన్నారులు

- వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

ఖిల్లాఘనపురం: గిరిజనుల ఆరాధ్యదైవం తుల్జాభవాని ఆలయాన్ని రాష్ట్రంలో మొట్టమొదటగా ఖిల్లాఘనపురం మండలం కర్నెతండాలో నిర్మించుకోవడం ఇక్కడి ప్రజల అదృష్టమని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. కర్నెతండాలో శనివారం నిర్వహించిన తుల్జాభవాని, బతుకమ్మ ఉత్సవాలకు మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ విజయదశమి పండుగను ప్రజలంతా సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. తెలంగాణ వచ్చాకే గిరిజన తండాలు అభివృద్ధి చెందాయని చెప్పారు. కనీసం రోడ్డు సౌకర్యం లేని తండాలకు బీటీరోడ్లు వేయించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. కర్నెతండా లిఫ్ట్ నిర్మాణ పనులను వేగవంతం చేసినట్లు తెలిపారు. ఉత్సవాల్లో బాలబాలికల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎంపీపీ కృష్ణానాయక్, సర్పంచ్ శాంతి, జెడ్పీటీసీ సామ్యానాయక్, సింగిల్‌విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, రంగారెడ్డి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

కాళరాత్రిదేవి అలంకరణలో జోగుళాంబ



నాట్యం చేస్తున్న హిమశ్రీ

జోగుళాంబ శక్తిపీఠం: ఐదో శక్తిపీఠం అలంపూర్ జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర క్షేత్రంలో దేవీ శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శనివారం అమ్మవారు కాళరాత్రిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. 'వరమూర్ధ్వ ధ్వజాకృష్ణా కాళరాత్రి భయంకరి' అంటూ ఆలయ అర్చకులు విశేష పూజలు చేశారు. కాళరాత్రిదేవిని ధ్యానించడం వల్ల శత్రువుల నుంచి కాపాడబడతామని దేవీ భాగవతంలో చెప్పబడిందని భక్తులకు వివరించారు. మహిషాసురుడిని సంహారం చేసేందుకు దుర్గాదేవి కాళరాత్రిగా అవతరిస్తుందని, అమ్మవారు చూడటానికి అతి భీకరంగా కనిపిస్తారని, నిషాదేవి అని కూడా పిలుస్తారని చెప్పారు. అపశృతికి సంకేతమైన గార్దీవం (గాడిద)ను ఆసనంగా ధరించి అసుర సంహారం చేస్తుందన్నారు. అందుకే నవరాత్రుల్లో ఏడవ రోజు భక్తులుశత్రుభాదలు తొలగించేందుకు, సర్వశుభాలను చేకూర్చేందుకు ఈ అమ్మవారిని ధ్యానిస్తారని అర్చకుడు నూనెపల్లి ధనుంజయశర్మ భక్తులకు వివరించారు. కేవలం దుష్టులకు మాత్రం అతి భీకరంగా, భక్తులకు మాత్రం కరుణా ప్రపూర్ణగా కనిపిస్తుందని తెలిపారు. సహస్రార చక్రంలో ఆరాధించే వారికి కాళరాత్రిదేవి అనుగ్రహం మరింత వేగంగా ఉంటుందని యోగసాధకుల ప్రగాఢ విశ్వాసమన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పురేందర్ కుమార్, చైర్మన్ చిన్నకృష్ణయ్య, ధర్మకర్త జల్లాపురం వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

జోగుళాంబ క్షేత్రంలో కర్నూలు కూచిపుడి కళానిలయానికి చెందిన ఎస్.హిమశ్రీదేవి నృత్య ప్రదర్శన అందరినీ అలరించింది. రెండు చేతుల్లో దీపాలు పట్టుకుని బిందెపై ఒంటికాలితో నిలబడి చేసిన నృత్యం మంత్రముగ్దులను చేసింది. ఈ సందర్భంగా నాట్యాచార్యులు నీరజ, చిన్నారి హిమశ్రీదేవిలను దేవస్థానం వారు అభినందిస్తూ ప్రశంసాపత్రం, మెమెంటో అందజేశారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం

జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాల్లో కొనసాగుతున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకుగాను సినీ హీరో శ్రీకాంత్, ఊహకు ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, ప్రధాన అర్చకుడు ఆహ్వానించారు. ఈనెల 22న వారు ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొననున్నట్లు వివరించారు.



ఆలయంలో పూజలను తిలకిస్తున్న భక్తులు

బతుకమ్మ ఘాట్లు ఏవీ?

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళలు
- తాత్కాలిక ఏర్పాట్లతోనే చేతులు దులుపుకొంటున్న మున్సిపల్ అధికారులు



బతుకమ్మలను నిమజ్జనం చేయడానికి తీసిన గోతి

అచ్చంపేట రూరల్: మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొనే పండుగలో బతుకమ్మ పండుగ ఒకటి. దేవీనవరాత్రి ఉత్సవాలు ప్రారంభోత్సవం నుంచి మహిళలు ప్రత్యేకంగా బతుకమ్మ పండుగను నిర్వహిస్తుంటారు. చిన్నారులు, యువతులు ఆడిపాడుతారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేస్తుంటారు. కానీ అచ్చంపేట మున్సిపాలిటీ పరిధిలో బతుకమ్మ ఘాట్లు లేక మహిళలు ప్రతిఏటా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీల సమీపంలో ఘాట్లు లేకపోవడంతో పట్టణానికి దూరంగా అటవీశాఖ కార్యాలయం సమీపంలో స్మృతివనంలో తాత్కాలికంగా తయారు చేసిన ఘాటు వద్దనే బతుకమ్మలను నిమజ్జనం చేయాల్సి ఉంటుంది. గతంలో మున్సిపాలిటీ సమక్షంలో రూ.లక్షలు వెచ్చించి స్మృతివనాన్ని ఏర్పాటు చేశారు. కాగా మున్సిపల్, అటవీ శాఖల మధ్య సమన్వయ లోపంతో ప్రస్తుతం స్మృతివనాన్ని అటవీశాఖ అధికారులు తమ పరిధిలోకి మలుపుకొన్నారు. గతంలో దసరా సంబరాలను ఎంతో వైభవంగా నిర్వహించే వారు. ప్రస్తుతం తాత్కాలిక ఏర్పాట్లతోనే సరిదిద్దుకోవాల్సి వస్తుంది.

తప్పని ఇబ్బందులు..

ఎంతో భక్తిశ్రద్ధలతో ఆనందంగా బతుకమ్మ పండుగలను జరుపుకొంటున్న మహిళలు, యువతులకు నిమజ్జన ఏర్పాటుకు ఘాట్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్మృతివనంలో మున్సిపల్ అధికారులు, పాలకవర్గం దోజర్లతో చదును చేసి, లైట్లు ఏర్పాట్లు చేసి చేతులు దులుపుకొంటున్నారే తప్పా.. శాశ్వతంగా ఘాట్లు ఏర్పాటు చేద్దామనే ఆలోచన చేయకపోవడం బాధాకరమని పట్టణ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెద్ద గోతి తీసి.. నీళ్లు పోసి

పట్టణంలోని ఆయా కాలనీల సమీపంలో బతుకమ్మ ఘాట్ల ఏర్పాటు కోసం అవకాశం ఉన్నా.. ఆ దిశగా అధికారులు, పాలకవర్గం ముందస్తు ప్రణాళికలు చేయడం లేదు. దసరా, బతుకమ్మ పండుగ దగ్గరకు వచ్చేసరికి హడావుడి చేసి చేతులు దులుపుకొంటున్నారు. బతుకమ్మ ఘాట్లను అవసరమైన చోట నిర్మిస్తే మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా వెళ్లి నిమజ్జనం చేసేందుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం స్మృతివనంలో పెద్ద గోతిని తీసి అందులో నీటిని నింపడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. వసతులు లేకపోవడంతో ప్రత్యేకంగా మహిళలు వాహనాలను ఏర్పాటు చేసుకుని నిమజ్జనానికి వెళ్తున్నారు. కొందరు పట్టణ మహిళలు స్మృతివనంలో కాకుండా సమీపంలోని నడింపల్లి, తాడూరు, ఇతర చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్నారు. బతుకమ్మ ఘాట్లను నిర్మించాల్సిన అవసరం ఉన్నప్పటికీ తాత్కాలిక వసతుల



ఉత్సవాల కోసం చదును చేసిన స్మృతీవనం

శాశ్వతంగా బతుకమ్మ ఘాట్ నిర్మించాలి..



పట్టణంలో అన్ని కాలనీల మహిళలకు అందుబాటులో ఉండేలా బతుకమ్మ ఘాట్‌ను శాశ్వతంగా నిర్మించాలి. ఎంతో భక్తిశ్రద్ధలతో, ఆనందంగా బతుకమ్మ పడుగను జరుపుకొంటాం. నిమజ్జన సమయంలో ఇబ్బందులు కలుగకుండా చూడాలి. ఘాట్ ఏర్పాటు చేసి అన్ని వసతులు కల్పించాలి.

– కె. ప్రశాంతి, మహిళ, అచ్చంపేట

అన్ని ఏర్పాట్లు చేశాం..



ప్రతి ఏడాది మాదిరిగానే స్మృతివనంలో బతుకమ్మ, దసరా పండుగ కోసం ఏర్పాట్లు చేశాం. ఈ నెల 22న బతుకమ్మ పండుగ సందర్భంగా నిమజ్జనానికి ఏర్పాట్లు చేశాం. మహిళలకు ఇబ్బందులు కలుగకుండా వసతులు కల్పిస్తున్నాం. శాశ్వత ఘాట్ నిర్మాణం కోసం పాలకవర్గం దృష్టికి తీసుకెళ్తాం.

– శ్రీహరిరాజు, మున్సిపల్ కమిషనర్, అచ్చంపేట

పత్తి క్వింటా రూ.7,050

ఊట్కూరు: ఊట్కూరు గ్రామ శివారులోని విజయ్ కాటన్ ఇండస్ట్రీస్‌లో శనివారం పత్తి ధర గరిష్ఠంగా రూ.7050, కనిష్ఠం రూ.6500 పలికింది. సుమారు 10వేల క్వింటాళ్ల కొనుగోలు చేసినట్లు మేనేజర్ భీమాశంకర్ తెలిపారు. ఊట్కూరు, నారాయణపేట, మక్తల్ తదితర మండలాల నుంచి రైతులు పత్తిని విక్రయించేందుకు తీసుకువచ్చారు. పత్తి ధర గతేడాదితో పోల్చితే క్వింటాపై సుమారు రూ.2వేలు తక్కువగా పలుకుతుందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

సోనామసూరి ధర రూ.2,171

దేవరకద్ర: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం జరిగిన ఈనామ్ టెండర్లలో సోనామసూరి ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.2,171 వచ్చింది. అలాగే హంస ధాన్యం ధర గరిష్ఠంగా రూ.2,003, కనిష్ఠంగా రూ.1,976 చొప్పున పలికాయి. ఆముదాలు క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.5,439 ఒకే ధర వచ్చింది. మార్కెట్‌లో సీజన్ ప్రారంభం కావడంతో లావాదేవీలు కొనసాగాయి.



పత్తి తేమ శాతాన్ని పరిశీలిస్తున్న సిబ్బంది

మున్సిపాలిటీ అకౌంటెంట్ సస్పెండ్

పాలమూరు: మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో జూనియర్ అకౌంటెంట్ ఉమాకాంత్‌ను సస్పెండ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన ఆరు నెలల కిందటే వరంగల్ మున్సిపాలిటీ నుంచి బదిలీపై మహబూబ్‌నగర్‌కు వచ్చారు. గతంలో వరంగల్‌లో పనిచేసిన సమయంలో మరో వ్యక్తితో కలిసి నకిలీ బిల్లులు తయారు చేసి దాదాపు రూ.3 కోట్ల వరకు మున్సిపాలిటీ నుంచి కాజేసినట్లు తేలింది. దీంతో పోలీసులు అతనిని అదుపులోకి తీసుకోవడంతో ఉన్నతాధికారులు విధుల నుంచి తొలగించినట్లు తెలుస్తోంది.



కల్వకుర్తిలో సంతానలక్ష్మి అలంకరణలో అమ్మవారు



జడ్చర్ల వాసవీమాత ఆలయంలో మహాలక్ష్మి అలంకారంలో..



అమిస్తాపూర్ సాక్షి గణపతి ఆలయంలో శాకాంబరిదేవి అలంకారంలో..



ఆత్మకూర్‌లోని వాసవీమాత ఆలయంలో సరస్వతిదేవి అలంకరణలో..



నారాయణపేట అంబాభవాని ఆలయంలో శ్రీకృష్ణుడి అవతారంలో అమ్మవారు